## క్లుప్తంగా

### అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడ్డ నిందితునితో సీఐ ఎస్‌కే రోషన్, ఏఎస్ఐ ప్రసాద్

**వల్లూరు :** మండల పరిధిలోని పైడికాలువ క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం 10 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. వల్లూరు ఏఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పైడికాలువ క్రాస్ వద్ద సీతోరుపల్లె గ్రామానికి చెందిన వేల్పుల చిన్న రెడ్డెయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### జీతాల ఆలస్యం ఉపాధ్యాయులకే ఎందుకు?



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి

**వేంపల్లె :** ఉపాధ్యాయుల జీత భత్యాల చెల్లింపు అన్ని విభాగాల ఉద్యోగులతో సమానంగా ఒకే సమయంలో జరగాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వేంపల్లెలోని స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల జీతాల చెల్లింపు విధానంలో ముందుగా ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు జీతాలు చెల్లించిన తర్వాతనే ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాలు చెల్లింపు ప్రక్రియ చేపడుతోందని.. ఇది సరైన విధానం కాదన్నారు. అందరితోపాటు సమానంగా ఉపాధ్యాయుల జీతాలను కూడా చెల్లించేలా విధానాన్ని మార్చుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏ ప్రభుత్వమైనా ఉద్యోగుల సంక్షేమాన్ని మరవకుండా ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బకాయిలన్ని వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల గంగిరెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ శివారెడ్డి, రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జొన్న పంటకు కత్తెర పురుగు దెబ్బ



ఆకులను తిన్న కత్తెర పురుగు

**పెద్దముడియం :** మండలంలో సాగు చేసిన జొన్న పంటకు కత్తెర పురుగు ఆశించడం వలన పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మండలంలో దాదాపు 1500 ఎకరాలలో జొన్న పంటను రైతులు సాగు చేశారు. ఖరీఫ్ చివరలో సాగు చేసిన జొన్న పంట మరి కొద్ది రోజుల్లో కంకి దశకు చేరుకుంటుంది. కాని ఈ సమయంలో కత్తెర పురుగు పంటను ఆశించడం వలన చెట్టుకు ఉన్న ఆకులన్నీ కత్తెరపురుగు వలన దెబ్బతింటున్నాయి. దీని వలన చెట్టులో ఎదుగుదల నశించి దిగుబడిపై ప్రభావం చూపే ఉందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి తగు సలహాలు ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.

### నూర్‌బాషా సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



నూర్‌బాషా సంఘం నూతన కమిటీ సభ్యులు

**జమ్మలమడుగు రూరల్ :** నూర్‌బాషా సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర దూదేకుల నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సిద్దయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని నూర్ బాషా సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సంఘ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు.

జమ్మలమడుగు నూర్‌బాషా సంఘం అధ్యక్షుడిగా వనిపెంట దూదేకుల కిరణ్, ఉపాధ్యక్షుడు బెల్లంకొండ దస్తగిరి, ట్రెజరర్ డి.మస్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నపీరయ్య, కార్యదర్శి నాదేండ్ల అశోక్ అర్యన్, ఉపకార్యదర్శిగా డి.హుసేనప్ప తదితరులను ఎన్నుకున్నారు. అలాగే ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా డి.సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సి.కుళాయిస్వామి, డి.నిరోషా తదితరులను ఎంపిక చేశారు.

# ఉచితం మాటున ఊదేస్తున్నారు..!

- పాపాఘ్ని నది నుంచి రోజూ అక్రమంగా ఇసుక తరలింపు
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా దోపిడీ
- రూ.లక్షలాది సొమ్ము చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- సామాన్యుడికి అందని ఉచిత ఇసుక
- చోద్యం చూస్తున్న అధికారులు



పాపాఘ్ని నదిలో ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

**వేంపల్లె :** టీడీపీ నేతలకు ఇసుక కాసులు కురిపిస్తోంది. ఓ పక్క ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రగల్బాలు పలకడమే గానీ.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఇసుకను తమకు ఆదాయ వనరుగా మార్చుకుని లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ నేతల బరి తెగింపుతో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా సాగుతున్న ఈ ఇసుక దందాలో రోజుకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇంటి అవసరాల కోసం ఎద్దుల బండి, ట్రాక్టర్లతో ఇసుకను తీసుకుపోవచ్చని ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని ఇచ్చింది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా వేంపల్లె పాపాఘ్ని నది నుండి నిత్యం లారీలు, ట్రిప్పర్లతో ఇసుకను తరలించి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొచ్చినా మండల ప్రజలకు అందుబాటులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయలేదు. ఇసుక రీచ్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉన్న స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. కొందరు అక్రమార్కులతోపాటు అధికార పార్టీ నాయకులు అక్రమ ఇసుక రవాణాకు తెర తీశారు.

**సామాన్యుడికి అందని ఇసుక :**

పేరుకే ఇసుక ఉచితమైన ప్రజలకు ఐదు నెలలుగా ఇసుక కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వేలాది రూపాయలు వెచ్చించి రోజుల తరబడి ఎదురు చూస్తే గానీ ఇసుక దొరకని పరిస్థితి ఉంది. పాపాఘ్ని నదిలో ఇసుక అందుబాటులో ఉన్న పేద ప్రజలు ఇసుకను తెచ్చుకోవాలంటే బాడుగ చెల్లించలేక ఆర్థికపరమైన అవస్థలు పడుతున్నారు.

**పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక రవాణా :**

మండలంలో ఇసుక రీచ్ లేకపోవడంతో కొందరు అధికార బలం ఉపయోగించి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని కుమ్మరాంపల్లె, మాలవంక, వేంపల్లె తదితర ప్రాంతాలకు పదుల సంఖ్యలో లారీలు, ట్రిప్పర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక డిమాండ్‌ను బట్టి ధరను నిర్ణయించి అమ్ముకుంటూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. మరికొందరు అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా పాపాఘ్ని నది నుండి ట్రాక్టర్లతో తీసుకుపోతున్నారు. కొంతమంది ప్రజలు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్నా.. అధికార పార్టీ నాయకుల సహకారంతో వారిని బెదిరించి తమ తంతును కొనసాగిస్తున్నారు.

**పాపాఘ్ని నదిలో మట్టి రోడ్డు ఏర్పాటు చేసుకుని మరీ :**

ఇసుక అక్రమ రవాణా కోసం పాపాఘ్ని నదిలో ఏకంగా ట్రిప్పర్లతో గ్రావెల్ మట్టితో రోడ్డు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. పగటిపూట ట్రాక్టర్లతో ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా మామిడి, నిమ్మ తోటల్లో డంపు చేస్తున్నప్పటికీ రెవెన్యూ, పోలీసు అధికారులకు ఏమాత్రం పట్టించుకోలేదు. ఇకనైనా రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీంతో రోడ్లు దెబ్బ తినడమేకాక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నారు.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు :**

పాపాఘ్ని నది పరివాహక చుట్టూ 21 గ్రామాల



అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన టిప్పర్, ట్రాక్టర్లు (ఫైల్‌ఫొటో)



పాపాఘ్ని నదిలో ఇసుకను తరలించడంతో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు



పాపాఘ్ని నదిలో ఇసుకను తరలించేందుకు ఉంచిన జేసీబీ

ప్రజలకు అధికారులు వేంపల్లె నుంచి రక్షిత మంచినీటి పథకాల బావులను నిర్మించి తాగేందుకు నీటిని అందిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అక్రమార్కులు ఈ స్కీమ్ బావులకు సమీపంలో ఇసుకను తోడడంవలన భూగర్భ జలాలు ఎండిపోయి రక్షిత మంచినీటి పథకాల బావుల్లో నీళ్లు ఉండడంలేదు. ఇసుక అక్రమార్కుల చర్యలతో వేంపల్లె చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు, ట్రిపర్ల ద్వారా ఇసుకను తోడేస్తుండడంతో పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై పలు గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఎవరు పట్టించుకోవడంలేదు. రెవెన్యూ అధికారులు వీఆర్వోలను కాపలాగా కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినా అధికార పార్టీ నాయకులు వారిని బెదిరించి ఇసుకను తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### కార్తీక మాసాలకు ముస్తాబైన శివాలయాలు

**లింగాల :** కార్తీక మాసోత్సవాలకు మండలంలో కొండకోనల్లో వెలసిన శివాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం కార్తీక మాస మొదటి సోమవారం కావడంతో ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సర్వం సిద్ధం చేశారు. నిత్య పూజలు, అభిషేకాలు, అర్చనలు, నోములు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయంలో కసుమూర్తి వెంకటమ్మ, వెంకటన్నల కుమారుడు, టీచర్ శ్రీనివాసులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ నాగభూషణం తెలిపారు. అదేవిధంగా మండలంలోని లింగాల, బోనాల, అంబకపల్లె, ఇప్పట్ల, దొండ్లవాగు తదితర గ్రామాల్లోని శివాలయాలు కార్తీక మాసోత్సవాలకు ముస్తాబయ్యాయి.

### నేటి నుంచి తిరుమల మహా పాదయాత్ర

**సింహాద్రిపురం :** స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని భక్త సమాజ మండలి కో ఆర్డినేటర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర మంగళవారం చక్రాయపేటకు, బుధవారం రాయచోటికి, గురువారం పీలేరుకు, శుక్రవారం భాకరాపురం, శనివారం తిరుమల సన్నిధికి చేరుకుంటుందన్నారు. రోజుకు 40కి.మీ చొప్పున 220కిలో మీటర్ల మేర పాదయాత్ర సాగుతుందన్నారు.

### టిప్పర్ల పట్టివేత

**కొండాపురం :** మండల పరిధిలోని ఏటూరు ఇసుకరీచ్ నుంచి నాలుగు టిప్పర్లు ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. పట్టుకున్న ఇసుక టిప్పర్లను మండల తహసీల్దార్ గురప్పకు అప్పజెప్పినట్లు సీఐ తెలిపారు.

## దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

**పులివెందుల రూరల్ :** దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య విద్యార్థులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను ఆయన సందర్శించి ప్రాణాంతక, మెదడు వాపు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గన్యా వ్యాధులు సోకిన వారు వెంటనే ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాంతక వ్యాధులు దరి చేరవన్నారు.

### ఘనంగా రెడ్డి రైతు బంధువుల ఆత్మీయ సభ



కడప జిల్లా రెడ్డి రైతు బంధువుల ఆత్మీయ సభ

**వల్లూరు(చింతకొమ్మదిన్నె) :** చింతకొమ్మదిన్నె మండలంలోని జయరాజా గార్డెన్స్‌లో భక్తమల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కడప జిల్లా రెడ్డి రైతు బంధువుల ఆత్మీయ సభను విజయవంతంగా కొనసాగింది. ఈ సభకు హాజరైన పలువురు వక్తలు మాట్లాడుతూ రెడ్ల ఐక్యతను తెలియజేస్తూ వ్యవసాయ స్థితిగతులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. రెడ్లు తమ పిల్లలకు విలువలతో కూడిన జీవితాన్ని తెలియజేస్తూ సమాజ, హక్కులు, నైతిక విలువలతో కూడిన విద్య, తల్లి దండ్రులు, గురువులు, సమాజాన్ని గౌరవించే విధంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. రెడ్డి రాజులు వందల సంవత్సరాల క్రితమే ఏకదాటిగా 120 సంవత్సరాలు పరిపాలించిన ఘన చరిత్ర ఉందని వక్తలు గుర్తు చేశారు. రెడ్ల ఐకమత్యం కావలసిన అవసరం ఆసన్నమైనదన్నారు. అనంతరం యోగివేమనరెడ్డి, హేమారెడ్డి మల్లమ్మ చరిత్రను తెలియజేశారు. రెడ్లు అన్ని రంగాల్లో రాణించాలని, రెడ్డి సామాజిక వర్గాలు ఉపాధి, ఉద్యోగం కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా సైరా నరసింహారెడ్డి వేషధారణతో ప్రదర్శించిన ఏకపాత్రాభినయంతో సభికులను విశేషంగా అలరించింది.

# సాగుకు వరద నీరు అడ్డంకి

**పెద్దముడియం :** మండల పరిధిలోని కుందూ నదీ పరీవాహక గ్రామాలైన నెమళ్లదిన్నె, పాలూరు, గరిశలరు, బలపనగడూరు, చిన్నముడియం గ్రామాల రైతులకు సంబంధించిర దాదాపు 200 ఎకరాల్లో కుందూ నీరు నిలిచిపోవడంతో రైతులు పంటల సాగుకు ఆటంకం ఏర్పడింది. గత మూడు నెలల నుండి కుందూ నదికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యురేటర్ నుండి భారీగ నీరు వదులుతుండటం, నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు కురవంటతో కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనితో నదీ పరీవాహక గ్రామాల పొలాలకు నీరు పోటెత్తింది. గత 15 రోజుల నుంచి వర్షాలు కరవకపోయిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూ నదికి భారీగ వరదనీరు వస్తుండటంతో పొలాల్లో నీరు అలాగే నిలిచిపోయింది. దీంతో పంటల సాగుకు అదును దాటుతోందని అధికారులు చర్యలు తీసుకుని పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కుందూ నదికి నీటి విడుదలను తగ్గించాలని రైతులు కోరుతున్నారు.



చిన్నముడియం గ్రామం వద్ద పొలాల్లో నిలిచిన వరద నీరు

# కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**కమలాపురం :** కరువుకు శాశ్వత నిలయమైన కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా కమలాపురం నియోజకవర్గంలోని రైతాంగం పంటలు చేతికి రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికి కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పేర్లు లేక పోవడం రైతులకు తీరని అన్యాయం అన్నారు. నియోజకవర్గంలోని 70 శాతం మంది రైతులు వర్షాధార పంటలు సాగు చేస్తుంటారన్నారు. మెట్ట భూమి అధిక శాతం ఉండటంతో రైతులు వర్షాల మీద ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారన్నారు. గత ఏడాది వర్షాలు లేక పంటలు చేతికి అందక రైతులు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అధికారులు కమలాపురం ప్రాంత రైతుల సమస్యలను గుర్తించక పోవడం చాలా విచారకరమన్నారు. వీఎన్‌పల్లె, పెండ్లిమర్రి మండలాల్లో ఉల్లిగడ్డలు సాగు చేసిన రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందన్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో ఉల్లి రైతుల సమస్యల గురించి నియోజకవర్గ రైతులతో చర్చించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఉల్లి రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను వ్యవసాయ శాఖ గుర్తించకపోవడం శోచనీయం అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తాము వినతి పత్రం పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

# భక్తుల ఇలవేల్పుకు ప్రత్యేక అభిషేకాలు

**వల్లూరు (చింతకొమ్మదిన్నె) :** చింతకొమ్మదిన్నె మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలదండలతో విశేషాలంకరణ చేశారు. భక్తులు పూజలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేసి తమ ఇలవేల్పును దర్శనం చేసుకున్నారు. భక్తులు అమ్మవారికి కానుకలను, ముడుపులను సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామి, శివాలయం, సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయం నందు భక్తులు పూజలు చేశారు.



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

# సంగమేశ్వరుని దర్శనం శుభకరం

**వీరపునాయునిపల్లె :** మండలంలోని పావని, పాపాఘ్ని, మొగమూరు నదుల సంగమ స్థానంలో వెలసిన సంగమేశ్వరుని దర్శించుకొంటే సకల పాపాలు హరించిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ క్షేత్రంలో అగస్త్య మహా ముని శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెపుతున్నాయి. మండల కేంద్రమై వీరపునాయునిపల్లెకు దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ప్రతి ఏడాది కార్తిక మాసం, మహా శివరాత్రి పర్వదినాల్లో ఈ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడం జరుగుతంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అందులో ప్రధానమైనది ఆంధ్రప్రదేశ్ టూరిజం గెస్ట్‌హౌస్. మరో వైపు వీరపునాయునిపల్లె మండలం ఇందుకూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త కొమ్మా శివప్రసాదురెడ్డి ఆలయ గాలిగోపురం నిర్మించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు.



పూజలందుకోనున్న సంగమేశ్వరుడు

### పులివెందులలో వర్షం

**పులివెందుల రూరల్ :** పులివెందుల ప్రాంతంలో నాలుగు రోజుల నుంచి ఉక్కపోత ఎండ వేడిమితో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం పులివెందులలో చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కాస్త ఉపశమనం పొందారు. ఒక పక్క ఎండ కాస్తున్నప్పటికీ వర్షం కురిసింది.



### కాలభైరవ పూజలు

**కడప అర్బన్ :** మహా పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పిలువబడే పుష్పగిరి దేవాలయంలో మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో సుమారు 100 మంది సభ్యులు, వారి కుటుంబసభ్యులు కాలభైరవ పూజలో ఆదివారం పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాశీ పిండ ప్రదాన కార్యక్రమం చేసిన మేము సైతం సభ్యులు రాము, అయ్యావారయ్య, రామలోకం, రామరాజు, శివరాం, గురువయ్య, మురళి మొదలగు వారు పాల్గొన్నారు.

# నదీ స్నానాల్లో అప్రమత్తత అవసరం

**వల్లూరు :** కార్తీక మాసం వచ్చింది. ఆధ్యాత్మికతకు, పవిత్రకు పేరుగాంచిన ఈ మాసంలో వన భోజనాలకు, ఆలయాల సందర్శనకు, ఇతర ఆధ్యాత్మిక, విహార యాత్రలకు ప్రజలు ఎ క్కువగా మొగ్గు చూపుతారు. ఎంతో శుభప్రదమైన ఈ మాసంలో నదీ స్నానాలకు ఎంతో ప్రాధాన్యత వుంది. ముఖ్యంగా ఈ మాసంలో సోమవారాలతో బాటుగా పౌర్ణమి రోజుల్లో బారీ సంఖ్యలో భక్తులు శైవక్షేత్రాలను దర్శించుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో భాగంగా నదీ స్నానాలు చేసి, నదిలో దీపాలు వదలడం, సమీపంలోని దేవాలయా ల్లో దీపాలు వెలిగించి దైవ దర్శనం చేసుకోవడం ముక్తికి మార్గాలుగా భావిస్తారు. అయితే వర్షాకాలమైనందున ఈ మాసంలో నదుల్లో సైతం నీటి ప్రవాహం అధికంగా వుంటుంది. దీంతో ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలు పొంచి వుంటాయి. దీన్ని దృష్టిలో వుంచుకుని ఏమరుపాటుకు అవకాశం ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని యాత్రలు విషాదం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**నీటి మాటున పొంచి వున్న ప్రమాదాలు**

ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో జిల్లాలోని నదులు, ఆనకట్టలు, చెరువులు, కుంటలు మొదలైన వాటికి జల కళ సంతరించుకుంది. ముఖ్యంగా నదీ పరివాహక పొంతాలన్నీ నీటి ప్రవాహంతో ఆహ్లాద కరంగా మారి అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఈ తరుణంలో నదులు, జలాశయాల వద్దకు సరదాగా గడపడానికి వెళ్లే పర్యాటకులు చిన్న పాటి జాగ్రత్తలు కూడా తీసుకోక పోవడంతో గంగకు బలై ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ నిపుణుల సలహాలు, సూచనలు.

**నీటిని చూస్తే ఉల్లాసం**

నదులు, జలాశయాలు, చెరువులు, కుంటలు వంటి వాటిని చూస్తే ఎలాంటి వారికైనా ఉత్సాహం వస్తుంది. సరదాగా కాసేపు ఈత ఆడాలనే ఉత్సాహం ఉరకలు వేస్తుంది. అయితే అంతే స్పీడుతో ప్రమాదాలు కూడా జరిగే అవకాశాలు వుంటాయి. కాబట్టి నీటిలో ఈత ఆడాలనుకున్నప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి.

- ముఖ్యంగా ప్రవాహ నీటిలో ఈత ప్రమాదకరమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎంత ఈత వచ్చిన వారైనా ప్రవాహం ఎక్కువగా వున్న చోట ఈతకు ప్రయత్నించరాదు.
- మద్యం సేవించి నీటిలో దిగరాదు.
- వాలు ఎక్కువగా వున్న ప్రాంతం, లోతు ఎక్కువగా వుండి నీటి ప్రవాహం ఎక్కువగా వున్న ప్రాంతాల్లో దిగరాదు.
- ఎవరైనా ప్రమాద వశాత్తూ నీటిలో కొట్టుకుని పోతుంటే వీలైనంత వరకు ఏదైనా తాడు లాంటి దాన్ని ప్రమాదం బారిన పడిన వ్యక్తికి అందించి రక్షించడానికి ప్రయత్నించాలి.

అంతే కాని ఏమీ ఆలోచించకుండా ఈత రాక పోయినా నీటిలో దూకి ప్రాణం మీదికి తెచ్చుకోరాదు.

- పిల్లలను మరీ నీరు తక్కువగా వున్న చోట మాత్రమే పెద్దల పర్యవేక్షణలోనే నీటిలోకి దించాలి. నదుల్లో తమ పిల్లలకు స్నానాలు దగ్గరుండి చేయించడం, లోతుకు దిగకుండా చూడడం వలన ముఖ్యంగా పిల్లలను ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.
- నేటి రోజుల్లో వయో బేధం లేకుండా దాదాపు ప్రతి ఒక్కరూ సెల్ఫీలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే సెల్ఫీల మోజులో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం వుంది. సెల్ఫీల మోజులో నీటి ప్రవాహంలో దిగి ప్రాణం మీదికి తెచ్చుకోరాదు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ మాసాన్ని పవిత్రంగా ముగించుకోవచ్చు.



పుష్పగిరి వద్ద పెన్నా నది ప్రవాహం